హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఎన్నికలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల ప్రక్రియ (2025–26) ప్రారంభమైంది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేయగా గురువారం నామినేషన్ల ప్రక్రియను ఆరంభించారు. శుక్రవారం నామినేషన్ల దాఖలు గడువు ముగుస్తుంది. పోలింగ్ 19న..కౌంటింగ్ 20న జరుగుతుంది.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మారోజు ప్రభాకరాచారి, ఉపాధ్యక్షులు రఘుచారి, ప్రధాన కార్యదర్శి పవిత్ర ఆంజనేయులు చారి, సహాయ కార్యదర్శి బసవాపురం నరేందర్ చారి, కోశాధికారి పసుమాముల శ్రీధర్ చారి, గౌరవ సలహాదారుగా వలభోజు మాణిక్య చారి, సలహా మండలి సభ్యులుగా గోవింద రావు, రవికాంత్ చారి, వేణుగోపాల్, శ్రీకాంత్ చారి, సంతోష్ చారి, యాదగిరిచారిలను ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రభాకరచారి మాట్లాడుతూ స్వర్ణకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. సంఘ సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు.

కొనసాగుతున్న నిరసన



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గురువారం విద్యార్థి సంఘం నిరసనలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో హెచ్‌సీయూ ప్రధాన గేటు మూసివేయడంతో విద్యార్థులు ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. ముఖ్యంగా విద్యార్థి యూనియన్‌ను రద్దు నిర్ణయాన్ని యూనివర్సిటీ వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ నాలుగు డిమాండ్లను అంగీకరించే వరకు నిరసన కొనసాగుతుందన్నారు.

నిరాహార దీక్ష ప్రారంభం

హెచ్‌సీయూలో ఇంటిగ్రేటెడ్ స్టూడెంట్లకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్షను ప్రారంభించారు.ఇంటిగ్రేటెడ్ విద్యార్థులు కొంతకాలంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదంటూ నిరసన తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ వి.సింధురెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని సమస్యలపై గురువారం ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యతగా రోడ్ల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కోరారు. ఎల్ఐజీ, ఎంఐజీ కాలనీలలో సీసీ రోడ్డులు, మ్యాక్ సొసైటీ కాలనీ డ్రైన్ పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, ఈఈ సురేష్, డీఈ దేవేందర్, ఏఈ ఫైజాన్‌లు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ

చెరువుల్లో జలకళ ఉట్టిపడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని చెరువులన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. నల్లగండ్ల చెరువు, చాకలి చెరువు, గోపిచెరువు కళకళలాడుతున్నాయి. చెరువులు నిండడంతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతున్నాయి. కాగా చెరువు కట్టలన్నింటినీ మరింత పటిష్టం చేయాల్సి ఉంది. చెరువుల్లో గుర్రపుడెక్క, చుట్టూరా వ్యర్థాలు, చెత్త డంపింగ్‌ను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

శేరిలింగంపల్లి



నీటితో కళకళలాడుతున్న నల్లగండ్ల చెరువు



గోపిచెరువు



భారీ వర్షం.. రోడ్లపై వరదనీరు



హైటెక్‌సిటీ ఆర్ఓబీపై బారులుదీరిన వాహనాలు



మాదాపూర్‌లో ప్రధాన రోడ్డుపై వరద నీరు

గచ్చిబౌలి: ఐటీ కారిడార్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ ఏరియాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం ప్రాంతాలలో ప్రధాన రోడ్లపైకి భారీగా వరదనీరు చేరడంతో అన్ని రోడ్లలోనూ వాహనాల రాకపోకలు నెమ్మదించాయి. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తలేదు. జీహెచ్ఎంసీ అధికారులు, హైడ్రా బృందం రంగంలోకి దిగడంతో సమస్యలు తలెత్తలేదు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



ఉదయ్‌రెడ్డి (ఫైల్)

గచ్చిబౌలి: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చెల్ జిల్లా శామీర్‌పేట్ మండలం అలియాబాద్‌కు చెందిన గొర్లి ఉదయ్‌రెడ్డి(22) ఓ ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తూ గౌలిదొడ్డిలోని పీజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. బుధవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో గచ్చిబౌలి నుంచి గౌలిదొడ్డికి స్నేహితుడు పంతాడి సత్యసాగర్‌తో కలిసి బైక్ వెళుతున్నాడు. విప్రో సర్కిల్ సమీపంలో బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో ఉదయ్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృత్యువాత పడ్డాడు. సత్యప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఉస్మానియా ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహంను అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

20 ఫోన్లు రికవరీ.. యజమానులకు అందజేత



ఫోన్లను అందజేస్తున్న డీఐ రమేష్‌నాయుడు

మియాపూర్ : మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ, పోగొట్టుకున్న 20 మొబైల్‌లను రికవరీ చేశారు. మియాపూర్ డీఐ రమేష్ నాయుడు గురువారం ఫోన్లను సంబంధిత యజమానులకుఅందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారాల వ్యవధిలో 20 ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. సెల్ ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

నవంబర్ 25 నుంచి హైటెక్స్‌లో పౌల్ట్రీ ఈవెంట్

బంజారాహిల్స్: దక్షిణాసియాలోనే అతిపెద్ద పౌల్ట్రీ ఈవెంట్‌ను నవంబర్ 25 నుంచి మూడు రోజుల పాటు హైటెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తెలిపింది. జూబ్లీహిల్స్‌లో గురువారం విలేకరుల సమావేశంలో పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్‌సింగ్‌బయాస్ మాట్లాడారు. 17వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను 'వన్ నేషనల్ వన్ ఎక్స్‌పో' అనే థీమ్ కింద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 25 నోవాటెల్‌లో ఈ ఈవెంట్ ప్రారంభమవుతుందన్నారు. ఎగ్జిబిషన్‌కు 50 దేశాల నుంచి 500కి పైగా ఎగ్జిబిటర్స్, 50,000కు పైగా సందర్శకులు పాల్గొంటారని తెలిపారు.

రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాడదాం

మియాపూర్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో దోపిడి, అసమానతలపై పోరాడదామని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ముజాఫర్ అహ్మద్ నగర్ కాలనీలో తాండ్ర రామచంద్రయ్య స్మారక భవన్‌లో కామ్రేడ్ తుకారాం నాయక్ ఆధ్వర్యంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. కామ్రేడ్ మద్దికాయల ఓంకార్, కామ్రేడ్ భీంరెడ్డి నర్సింహారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు సుకన్య, అంగడి పుష్ప, దశరథ్ నాయక్, కర్ర దానయ్య, సభ్యులు విమల, శివాని, సుల్తానాబేగం, రజియాబేగం, ఈశ్వరమ్మ, గీత తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం,పన్ను చెల్లింపులపై దృష్టి సారించాలి



చందానగర్ : చందానగర్ సర్కిల్ కార్యాలయంలో శానిటేషన్, రెవెన్యూ అధికారులతో ఉపకమిషనర్ శశిరేఖ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లు, కాలనీలు, బస్తీలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. రోడ్లపైన చెత్త చెదారం వేయకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్నపూర్ణ క్యాంటీన్ చుట్టుపక్కల ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో హెల్త్ అండ్ శానిటేషన్ సూపర్వైజర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ, ఎస్ఆర్‌పీ, రాంకీ అధికారులు పాల్గొన్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపులు, వ్యాపారం సముదాయాలకు ట్రేడ్ లైసెన్స్ చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ చెల్లించని వారికి నోటీసులు అందించాలన్నారు.

రూ.9.67 కోట్లతో సీసీ, బీటీ రోడ్లకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు పూజితగౌడ్, జగదీశ్వర్‌గౌడ్

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో సీసీ, బీటీ రోడ్లకు గురువారం ఎమ్మెల్యే గాంధీ, కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మంజీరా పైప్‌లైన్ రోడ్డు, హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి రిజర్వాయర్ వరకు, జనప్రియనగర్ కాలనీలలో సుమారు రూ.9.67 కోట్లతో నూతన రోడ్ల నిర్మాణం, ఓపెన్‌జిమ్‌లు చేపట్టడం జరుగుతుందన్నారు. రూ.3.42 కోట్లతో మంజీరా పైప్‌లైన్ రోడ్డులో జీహెచ్ఎంసీ స్టోర్స్ నుంచి కెకెఎస్ బేకరి వరకు, రూ.2.45 కోట్లతో కెకెఎస్ బేకరి నుంచి మై హోమ్ జువెల్స్ వరకు సీసీ రోడ్డు, రూ.3.80 కోట్లతో హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి రిజర్వాయర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చందానగర్ సర్కిల్– 21 ఇంజనీరింగ్ విభాగం అధికారులు, నాయకులు ధాత్రీనాథ్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, పద్మారావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, నాయకులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 30, పచ్చిమిర్చి 50 , బెండ 40, కాకర 40, దొండ 50, దోస 40, ఆలు 30, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 80, అల్లం 100, వెల్లుల్లి 150.

హుండీ లెక్కింపు

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానం హుండీ లెక్కింపును గురువారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ ఈఓ శశిధర్, చైర్మన్ సుధాకర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం 193 రోజుల హుండీ ఆదాయం రూ. 10,25,254 వచ్చిందని ఈఓ శశిధర్ తెలిపారు.

పాఠశాలకు ఆలస్యంగా రాక..

- విద్యార్థులకు అనుమతి నిరాకరణ..
- కేవీ ప్రిన్సిపల్ తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

గచ్చిబౌలి: విద్యార్థులు పాఠశాలకు 5 నిమిషాలు ఆలస్యంగా రావడంతో లోపలికి అనుమతించలేదు. దీంతో గేటు బయటే ఉండిపోయారు. కనీసం తమకు సమాచారం అందించ లేదని తల్లిదండ్రులు ప్రిన్సిపల్ తీరుపై మండిపడ్డారు. వివరాలిలా.. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో గురువారం విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయకు విద్యార్థులు అయిదు నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. అప్పటికే గేటు మూసివేశారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను లోపలికి అనుమతించమని చెప్పారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అక్కడకు చేరుకొని ఇలా చేస్తే ఎలా అని ప్రశ్నించారు. కాగా ఈ విషయమై ప్రిన్సిపల్ మాట్లాడుతూ రోజూ పాఠశాలకు ఆలస్యంగా వస్తున్న వారికి విషయం తెలియాలనే గేట్లు మూసి వేయడం జరిగిందన్నారు.

హిందీ దివస్ పోస్టర్ ఆవిష్కరణ



హిందీ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన వీసీ సయ్యద్ ఐనుల్ హసన్, ప్రొఫెసర్లు

రాయదుర్గం: అధికారిక భాష హిందీని ప్రగతిశీలకంగా మార్చడం అవసరమని మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో హిందీ దివస్ పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో హిందీ దివాస్‌ను ప్రతియేటా ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్ సయ్యద్ నజ్ముల్ హసన్ మాట్లాడుతూ హిందీ మన అధికారిక భాష, దానిని స్వీకరించడం మన బాధ్యత అని అన్నారు. హిందీ అధికారి డాక్టర్ షగుఫ్తా పర్వీన్ మాట్లాడుతూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సెప్టెంబర్ 11 నుంచి 17వ తేదీ వరకు హిందీ వారోత్సవాన్ని నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కవితా పఠనం, వ్యాసరచన, క్విజ్, పరిపాలనా పదబంధాలు వంటి వివిధ పోటీలు నిర్వహించబడతాయని వివరించారు. కార్యక్రమంలో అధికారిక భాషా అమలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విధాన నిర్ణయాలకు డేటా ఆధారిత విశ్లేషణ ముఖ్యం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అజిత్ రత్నాకర్ జోషి



రాయదుర్గం: విధాన నిర్ణయాలకు డేటా ఆధారిత విశ్లేషణ ఎంతో ముఖ్యమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అజిత్ రత్నాకర్ జోషి పేర్కొన్నారు. హెచ్‌సీయూలోని ఎకనామిక్స్ విభాగం ఎకాన్ లాగ్ సెమినార్ సిరీస్‌లో భాగంగా ఈస్ట్ క్యాంపస్‌లోని సెంట్రల్ ఆడిటోరియంలో 'డేటా మరియు విధాన నిర్ణయం కోసం అనుభవ విశ్లేషణ' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత డేటా ఆధారంగా ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవచ్చుని, అయితే భవిష్యత్ విధానాలకు సరైన అంచనాలు అవసరమన్నారు. డేటా నిల్వ, ప్రాసెసింగ్, విశ్లేషణలో పురోగతి వల్ల నిర్ణయాలు తీసుకోవడంలో డేటా కీలంగా మారిందన్నారు. ఆర్‌బీఐ యొక్క క్వార్టర్లీ ప్రొజెక్షన్ మోడల్ వంటి నమూనాలు ద్రవ్యోల్బణం, ద్రవ్య విధాన అంచనాలకు మార్గనిర్దేశం చేస్తాయన్నారు. అనంతరం హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ ప్రొ. జగదీశ్వర్‌రావు, ఎకనామిక్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ దేబాశిస్ ఆచార్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞాపరమిత మిశ్రా మాట్లాడుతూ బలమైన డేటా బేస్‌లు విశ్వసనీయతను, స్పందనను మెరుగుపరుస్తాయన్నారు. అనంతరం జరిగిన ప్రశ్నోత్తరాల సెషన్‌లో విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు డాక్టర్ జోషి తన దైనశైలిలో సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ రికార్డులు స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: ఐనోల్, చిన్న కంజర్ల, పెద్ద కంజర్ల, బచ్చుగూడెం గ్రామాల రికార్డులను గురువారం ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి స్వాధీనం చేసుకున్నారు.